ప్రజాశక్తి

శనివారం 18 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



విద్యుత్ వెలుగుల్లో కోటప్పకొండ ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధం

కోటప్పకొండకు తరలి వస్తున్న భారీ ప్రభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మహాశివరాత్రి తిరునాళ్లకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఆయా శైవక్షేత్రాల వద్ద ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రధానంగా రాష్ట్రపండుగ అయిన కోటప్పకొండ, అమరావతి, క్వారీ, దైద, సత్రశాల, గోవాడ, పెదకాకాని తదితర శైవక్షేత్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆయా శైవ క్షేత్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించి క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పల్నాడు జిల్లా కోటప్పకొండ, అమరావతి, గుంటూరు జిల్లా చేబ్రోలులోని క్వారీకి భారీగా సందర్శకులు తరలి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పలుగ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి భారీ ప్రభలు తరలివెళ్లనున్నాయి.

పల్నాడు జిల్లా ఆవిర్భావం తరువాత తొలిసారిగా ▶ 2లో

ఎన్‌జి రంగా వర్సిటీ వద్ద కొనసాగిన నిరసన 2 లో

కౌన్సిల్ భేటి వాడీవేడీ

- సమస్యలపై గళమెత్తిన కార్పొరేటర్లు
- ఆర్‌యూబిల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- పేదలుండే స్థలాల మీదే అధికారుల దృష్టని, బడాబాబుల ఆక్రమణలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం
- టిడ్కో ఇళ్లు అప్పగించండి : కోవెలమూడి
- కార్పొరేటర్ కృష్ణారెడ్డికి నివాళి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. తొలుత ఇటీవల మృతి చెందిన కార్పొరేటర్ టి.కృష్ణారెడ్డి మృతికి సమావేశం సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు ర్పించారు. సమావేశం ప్రారంభంకాగానే ఆర్‌యూబి, ఆర్వోబీల నిర్మాణ పరిస్థితి, కార్పొరేషన్ తీసుకుంటున్న చర్యలపై లక్ష్మణరావు ▶ 2లో



వైసిపి - టిడిపి కార్పొరేటర్ల తోపులాట 2 పేజీ

సీనియర్ న్యాయవాది చిన్నయ్య మృతి

ప్రజాశక్తి - గుంటూరు లీగల్



గుంటూరు జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తున్న అవ్వారి చిన్నయ్య (54) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఆయన కొద్దిరోజులుగా గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏసీ లా కాలేజీలో న్యాయశాస్త్రాన్ని చదివిన చిన్నయ్య 1997లో రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. గుంటూరులోని ప్రముఖ న్యాయవాది వింజమూరి రాజగోపాలచారి వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. అనంతరం సొంతంగా ప్రాక్టీస్ చేపట్టి అనేక ముఖ్యమైన సివిల్, క్రిమినల్ కేసులు వాదించారు. చిన్నయ్య మృతికి గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాలడుగు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు వాల్టర్‌బాబు, ఆలీ అబ్దుల్‌ఖాన్, ఎం.డేవిడ్, ఎం.శ్రీనివాసు, వింజమూరి రాజగోపాలాచారి తదితరులు సంతాపం తెలిపారు. చిన్నయ్యకు సంతాప సూచికంగా సోమవారం కోర్టు విధులకు హాజరు కాకూడదని తీర్మానించారు.



డాక్టర్ అన్షుల్ అవిజిత్‌ను సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్

వర్సిటీని సందర్శించిన జగ్జీవన్‌రామ్ మనవడు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీని శుక్రవారం జగజ్జీవన్ రామ్ మనవడు డాక్టర్ అన్షుల్ అవిజిత్ సందర్శించారు. వర్సిటీలోని జగ్జీవన్ రామ్ చైర్ విభాగాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ లోని జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళు లర్పించారు. అనంతరం విసి పి రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విసి ఆయనను సత్కరించారు.

వైసిపి - టిడిపి కార్పొరేటర్ల తోపులాట

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వైసిపి, టిడిపి కార్పొరేటర్ల తోపులాటతో శుక్రవారం నిర్వహించిన గుంటూరు నగరపాలక సంస్థ సాధారణ సమావేశం రసాభాసగా మారింది. వివిధ డివిజన్లకు నిధుల కేటాయింపుపై చర్చ సందర్భంలో టిడిపి కార్పొరేటర్ మానం పద్మశ్రీ ప్రాతినిధ్యం వహిస్తున్న 38వ డివిజన్‌కు అత్యధికంగా రూ.4 కోట్లు కేటాయించామని మేయర్ కావటి మనోహర్ నాయుడు ప్రకటించారు. ఇందులో ఎంపీ గల్లా జయదేవ్ తన ఎంపి ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలే ఇచ్చారన్నారు. అనంతరం దీనిపై వైసిపి కార్యకర్తలు వెగతాళిగా మాట్లాడ్డంతో టిడిపి కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిధులు కావాలంటే ఎంపీని ఎందుకడగలేదని ప్రశ్నించారు. ఆయన గుంటూరులో ఎక్కడుంటున్నారని వైసిపి కార్పొరేటర్లు ప్రశ్నించడంతో వాగ్వాదం పెరిగింది. ఎంపి గల్లా జయదేవ్ కనిపించడం లేదని, ఎంపి ఈజ్ మిస్సింగ్ అంటూ వైసిపి కార్పొరేటర్లు నినాదాలు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ పరదాల నుంచి బయటకు రాని సిఎం అని టిడిపి వారు ప్రతి నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్పొరేటర్లకూ తోపులాట తలెత్తింది. వైసిపి మహిళా కార్పొరేటర్లు ముందుకు వెళ్లి టిడిపి కార్పొరేటర్‌లతో ఘర్షణకు దిగారు. మైకులో నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ బూసి రాజలత మైకును టిడిపి కార్పొరేటరు తీసుకోవడంతో మహిళలపై టిడిపి దౌర్జన్యం చేశారని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని ఆమె డిమాండ్‌చేశారు. తీవ్ర గందరగోళం మధ్య సమావేశాన్ని మేయర్ భోజన విరామం కోసం వాయిదా వేశారు. సమావేశం తిరిగి ప్రారంభం కాగానే మేయర్ మాట్లాడుతూ గుంటూరులో పార్టీలకు అతీతంగా 57 డివిజన్ల పరిధిలో రూ.327 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా ఎంపి గల్లా జయదేవ్ తన నిధుల నుంచి టిడిపి కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు డివిజన్లకే రూ.కోటి 38 లక్షలు ఇచ్చారని తెలిపారు. మిగతా 50 డివి జన్లను ఎంపి విస్మరించారన్నారు. ఆయన మాదిరి తాము కులం, పార్టీ భేదాలు చూసుకోవడం లేదని ఎద్దేవ చేశారు.

పంట కాల్వల్లో గుర్రపు డెక్కను తొలగించాలి

- రబీ పంట కొనుగోలుకే కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు:పొలాలకు సాగు నీరు సరిగా అందించేందుకు ఇరిగేషన్ అధికారులు ఇప్పటి నుండే కాల్వల మరమ్మతులు, గుర్రపుడెక్క తొలగింపు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకష్ణ అధ్యక్షతన శుక్రవారం కలక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు ఛానల్, అప్పాపురం ఛానల్‌లలో గుర్రపు డెక్క తొలగింపునకు శాశ్వత చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించిన కొన్ని రోజులకే మళ్లీ వస్తుందని, రానున్న వేసవిలో రెండు నెలలు కాల్వల్లో నీరు ఉండని సమయంలో గుర్రపు డెక్క తొలగింపునకు శాశ్వత చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పంట కాల్వల్లో, డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. మొక్కజొన్న, జొన్న, శనగ పంటలు చేతికి వచ్చే సమయానికి పంట సేకరణ కేంద్రాల ఏర్పాటుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. క్వింటాళ్ శనగలకు ప్రభుత్వం రూ.5300 మద్దతు ధర ఇస్తుందని, 2500 టన్నుల శనగలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని మార్క్ ఫెడ్ శాఖ జనరల్ మేనేజర్ కలెక్టర్‌కు తెలిపారు. క్వింటాళ్ మినుములకు రూ.6600 పెసలు రూ.7700, మొక్కజొన్న రూ.1960 మద్దతు ధర ఇస్తున్నందున రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన పంట సేకరణ కేంద్రాల్లో అమ్ముకునే విధంగా అవగాహన కలిగించాలని అన్నారు. 176 ఆర్‌బీకేల్లో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామని, వీటిలో టార్పాలిన్ పట్టాలు, ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, నాగళ్లు అందుబాటులో ఉంటాయని, అవసరమైన రైతులు పొందవచ్చని వివరించారు. సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు రుణ సౌకర్యం కల్పించాలని ఎల్‌డిఎంకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వజ్రశ్రీ, ఇరిగేషన్ ఎస్ఇ యు.ఉమామహేశ్వరరావు, మార్క్ఫెడ్ డీఎం కృష్ణారావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల సంస్థ డీఎం జి.శ్రీలక్ష్మీ, డ్రెయినేజీ కెనాల్స్ ఈఈ మురళీకృష్ణ, కెడబ్ల్యూడి ఇఇ పి.వెంకటరత్నం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

కౌన్సిల్ భేటి వాడీవేడీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించగా అధికారులు దాటవేత ధోరణి ప్రదర్శించారు. అధికారులు డిపిఆర్ తయారు చేస్తున్నట్టు ఆర్అండ్‌బి అధికారులు చెప్పగా లక్ష్మణరావు ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్యామలనగర్, సంజీవయ్య నగర్‌లో ఆర్‌యుబిల నిర్మాణం చేపట్టాల్సిన బాధ్యత కార్పొరేషన్, రైల్వే శాఖలదేనన్నారు. శంకర్ విలాస్ ఆర్‌వోబి ఆర్అండ్ బి అధికారులు చూస్తారని అత్యంత ప్రాధాన్యతగా రెండు ఆర్‌యూబిలను నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ శ్యామలానగర్ ఆర్‌యూబి నిర్మాణంపై ప్రస్తావించారు. తక్షణం దీనిని చేపట్టాలన్నారు. ఇందుకు మేయర్ అంగీకరించారు. త్వరలో చర్యలు తీసుకుంటామనిన్నారు. అనేకచోట్ల కార్పొరేషన్ భూములు కబ్జా అవుతుండటంపై తీసుకున్న చర్యల గురించి ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. పేదలుంటున్న స్థలాల మీదే అధికారులు దృష్టి సారిస్తున్నారన్నారు. బడా బాబులు పెద్ద ఎత్తున భూములు ఆక్రమిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దేవుడి బొమ్మలు పెట్టి ఎకరాల కొద్ది భూములు స్వాధీనం చేసుకుంటున్నారని వీటిపై దృష్టి పెట్టాలన్నారు. గుజ్జనగుండ్లలో ఆలయం నిర్మాణం పేరుతో కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేశారని చెప్పారు. హోర్డింగ్‌ల అంశంపైనా లక్ష్మణరావు ప్రస్తావించారు. రూ.9.39 కోట్లకు గాను రూ.1.167 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు చెప్పగా హోర్డింగ్‌ల వ్యవహారంపై కమిటీవేసి టెండరు పద్ధతిలో ఇచ్చే విధానం గురించి ఆలోచించాలన్నారు. హోర్డింగ్‌ల నిర్వహణలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్ ఆరోపించారు. కార్పొరేటర్లకు డిసిపి కోటయ్యకు మధ్య తీవ్ర వాగ్వావాదం జరిగింది. అనధికారిక హోర్డింగ్‌ల వివరాలను వారు మేయర్‌కు ఇవ్వగా వాటిని వెంటనే తొలగించాలని మేయర్ ఆదేశించారు. జరిమానా కూడా విధించాలని కార్పొరేటర్లు కోరారు. చిన్న హోర్డింగ్ దారులపై దాడులు చేస్తున అధికారులు ప్రకాష్ ఆర్ట్స్ వంటి సంస్థల జోలికి వెళ్లడం లేదన్నారు. కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం రాకుండా అధికారులు నిర్వాహకులతో కుమ్మక్కు అవుతున్నారని ఆరోపించారు.

కార్పొరేషన్ లో దాహం కేకలు

చాలా ప్రాంతాల్లో తాగునీరు సరిగా రావడం లేదని పలువురు కార్పొరేటర్ అన్నారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో 20 నిమిషాలు మాత్రమే నీటి సరఫరా అవుతోందని చెప్పారు. గోరంట్ల రిజర్వాయర్ నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయని త్వరలో టిడ్కో ఇళ్లకు తాగునీరు అందిస్తామని కమిషనర్ కీర్తి తెలిపారు. 10 విలీన గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు కోవెలామూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలు చెల్లిస్తున్న పన్నుల సొమ్ము రాష్ట్ర ఖజానాకి వెళు ందా లేదా గుంటూరు అభివృద్ధికి వినియోగిస్తున్నారా అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఎప్పుడు అప్పగిస్తారని ప్రశ్నించారు. ఎంతో మంది అర్హులను అనర్హులుగామార్చి జాబితాలు తారు మారు చేశారని అన్నారు. అభివృద్ధి పనులకు 57 డివిజన్లకు ఒక్కో డివిజన్‌కు రూ.కోటి ఇవ్వాలని రవీంద్ర కోరారు. అనధికారిక లే అవుట్‌లపై కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి ప్రశ్నించగా 173 లే అవుట్లు అధికారికంగా ఉన్నాయని, అనధికారికంగా వేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆర్.అగ్రహారం, కృష్ణబాబు కాలనీలో అనధికారిక లే అవుట్స్ ఉన్నాయని అచ్చాల వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ రమణ మూర్తి కి వెంకటరెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది.

కళలను, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేటర్లు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానాలు సరిగా ఇవ్వడం లేదన్నారు. ప్రశ్న వచ్చిన రోజే కార్పొరేటర్‌తో చర్చించాలని కోరారు. నగరంలో కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం తప్ప నగరంలో ఈ కార్యక్రమాల నిర్వహణకు తగిన స్థలాలు లేవన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల మాట్లాడారు. సమావేశంలో పలు అంశాలపై కార్పొరేటర్లు అడిగిన 76 ప్రశ్నలపై చర్చించారు. 104 ప్రతిపాదనలకు, 19 ప్రియాంబుల్స్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

నిర్ణయాలు

సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు మేయర్ వెల్లడించారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్.యు.బి లు, ఆర్.ఓ.బి ల నిర్మాణానికి రైల్వే, ఆర్ అండ్ బి తో సమన్వయము చేసుకొని ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వం అనుమతులు త్వరగా తీసుకురావడానికి కృషి చేయాలి. నగర పాలక సంస్థకు చెందినా స్తలాల్లో ఆక్రమణల తొలగింపు, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలి. విద్యుత్ దీపాల నిర్వహణకు ప్రత్యేకంగా ఎఇలను నియమించాలి. ప్రకటనల హోర్డింగు బోర్డుల క్రమబద్ధీకరణకు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు, ఫీజుల వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి. రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలి. అనధికారిక లే అవుట్ లు, వెంచర్ల పై చర్యలు తీసుకోవాలని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగులపై 2 నెలలలోపు విచారణ చేసి చర్యలకు సిఫారసు చేయాలలి. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, వీధి లైట్ల ఏర్పాటు, వీధి కుక్కల నియంత్రణకు వ్యాక్సినేషన్, యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏ.బి.సి) నిర్వహణకు ఇద్దరు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన చర్యలు. గోరంట్ల కొండపై నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులు పూర్తి చేసి నిర్దేశిత ప్రాంతాలకు త్వరలో తాగు నీరందించాలని నిర్ణయించారు.

శివరాత్రి ఉత్సవాలకు సర్వంసిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న కోటప్పకొండ ఉత్సవాలను జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లను చేసింది. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పి రవిశంకర్‌రెడ్డి ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఇప్పటికే నర్సరావుపేట చేరుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి సిబ్బందిని నర్సరావుపేటలో నియమించారు. షిఫ్టుల వారీగా డ్యూటీలు వేశారు. ప్రభల రాక సందర్భంగా విద్యుత్ శాఖ తరుపున అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ ఎస్ఇ మురళీ తెలిపారు. ఆర్‌టిసి బస్సులకు సంబంధించి ఏర్పాట్లను ప్రజారవాణ అధికారి విజయగీత పర్యవేక్షిస్తున్నారు. గుంటూరు నుంచి గోవాడ, క్వారీ, అమరావతికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. పల్నాడు జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు నర్సరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి డిపోల బస్సులను నడుపుతున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి కోటప్పకొండ, అమరావతికిప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. బాపట్ల జిల్లా నుంచి గోవాడ,కొండకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. మొత్తంగా మూడు జిల్లాల నుంచి దాదాపు 700 బస్సుల వరకు సందర్శకుల కోసం నడుపుతున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు శనివారం కోటప్పకొండ రానున్నారు. సుమారు కనీసం రెండు లక్షల మంది కోటప్పకొండ దర్శించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఎన్‌జి రంగా వర్సిటీ వద్ద కొనసాగిన నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, తదితర చోట్ల పని చేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం లాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద నిరసన రెండోరోజైన శుక్రవారమూ కొనసాగింది. యూనియన్ అధ్యక్షులు నామతోటి రాణి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని గతనెల 31వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీసు ఇచ్చినా, దానిపై ఇప్పటివరకు నాయకత్వంతో చర్చించలేదన్నారు. 20వ తేదీ నుండి సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించడంతో హడావిడిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, తదితర కేంద్రాల అధికారులకు కాంట్రాక్టు లేబర్ జీతాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం పెంచుతామని చెప్పడం మినహా, ఇతర సమస్యల గురించి ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అన్యాయమన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన యూనియన్ నాయకత్వానికి కనీసం తీసుకున్న చర్యలకు సంబంధించి తెలియ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. నిరసనలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద రాజేష్, మెడబలిమి పద్మ, సుబ్బాయమ్మ, సుమలత, నిర్మల, రాజు, వెంకటేశ్వర్లు, కిషోర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రమాదం కాదు.. హత్య..

- యువకుడిని కొట్టి చంపి కాల్వలో పడేసిన దుండగులు
- డబ్బులు, మద్యం కోసమే హత్య - ఇద్దరు అరెస్టు
- కేసును చాకచక్యంగా ఛేదించిన రూరల్ పోలీసులు

ప్రజాశక్తి-తెనాలి

ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెంది ఉంటాడని భావించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం హత్యగా నిర్ధారించారు. ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు. దీనిపై వివరాలను డీఎస్పీ కె.స్రవంతిరాయ్ శుక్రవారం వెల్లడించారు. మండలంలోని కఠెవరం చెరువులో ఈనెల 6న మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుని వద్ద లభ్యమైన టెలి ఫోన్ బిల్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడిని గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన పెద్దింటి వెంకటశ్రీకాంత్(36)గా గుర్తించారు. మద్యం మత్తులో చెరువులో పడి ఉంటాడనే మృతుడి తల్లి పి.అనసూయ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులను చేసిన విచారణలో మృతుని ఇంటికి సంబంధించి కోర్టులో వివాదం ఉందని, భార్యతోనూ విభేదాలున్నాయని పోలీసులు గుర్తించారు. మృతుని ఇంటి వద్ద నుంచి సిసి కెమెరాలో అతని కదలికలను పరిశీలించారు. కారులో తెనాలి మరదలి ఇంటికి వచ్చి, అక్కడి నుంచి పట్టణంలో ఓ ఆటోలో మార్కెట్ కూడలిలోని వైన్ షాపు వద్ద ఆగినట్లు గుర్తించారు. అక్కడ వైకుంఠపురం పోతురాజు కాలనీకి చెందిన అన్నం రమేష్, చినరావూరు రైల్వే స్టేషన్ సమీపంలో నివసించే కె.మాధవ్ ఇద్దరూ వెంకటశ్రీకాంత్‌ను సమీపించి, అతనితో మాటలు కలిపి మద్యం సేవించారు. అతని జేబులోని రూ.600 లాక్కున్నారు. అనంతరం దాడి చేసి ఫోన్‌పే ద్వారా కొంత నగదును బదిలీ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా అతనిని కఠెవరం చెరువు గట్టు వరకు తీసుకెళ్లి ఫోన్ లాక్కున్నారు. మృతుడు ప్రతిఘటించే ప్రయత్నం చేయగా తీవ్రంగా కొట్టి చంపి చెరువులో పడవేసి ఉడాయించారు. సిపి ఫుటేజి ద్వారా నిందితులను గుర్తించిన పోలీసులు విచారణ చేశారు. మృతుడు ఎక్కిన ఆటోనునూ పట్టుకున్నారు. ఆటోడ్రైవర్ ద్వారా కొంత సమాచారం రాబట్టి నిందితులను శుక్రవారం ఆరెస్ట్ చేశారు. రూరల్ సిఐ కె.శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు హెడ్ కానిస్టేబుల్స్ వి.రవి, పి.మణికుమార్, పిసిలు డి.శివరామకృష్ణ, రాము బృందంగా ఏర్పడి కేసును ఛేదించగా వీరిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఇదిలా ఉండగా నిందితులిద్దరూ పాత నేరస్తులే. పలు కేసుల్లో వీరిపై తెనాలి, కొల్లిపర, బాపట్ల ప్రాంతాల్లో కేసులున్నట్లు పోలీసులు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ కె.స్రవంతిరాయ్, వెనుక వరుసలో నిందితులు



పెద్దింటి వెంకట శ్రీకాంత్ మృతదేహం(ఫైల్)

పోలీసుల అదుపులో దొంగ స్వాములు

ప్రజాశక్తి-ఈపూరు

ప్రజలను మాయమాటలతో మభ్యపెట్టి నగదు కాజేసే దొంగ స్వాములను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలం లోని ఊడిజర్లలో శుక్రవారం జరిగింది. ముగ్గురు వ్యక్తులు స్వాముల వేషధారణలో గ్రామంలో సంచరించారు. మహిళలు ఒంటరిగా ఉన్న ఇళ్లను ఎంపిక చేసుకొని జాతకాల సాకుతో వారికి మాయ మాటలు చెబుతున్న క్రమంలో అనుమానం వచ్చిన గ్రామస్తులు ఆ ముగ్గురిని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలు చెప్పారు. ముగ్గురుని పట్టుకునే క్రమంలో ఒకరు పరారయ్యారు. ఇద్దరిని ఓ ఇంట్లో బంధించి పోలీ సులకు గ్రామస్తులు సమాచారం అందించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు దొంగ స్వాములను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు స్వాధీనం



ప్రజాశక్తి-దుగ్గిరాల: మండలంలోని గొడవర్రు సమీపంలో కృష్ణా నది ఇసుకరీచ్ నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఎ.శ్రీనివాసరెడ్డికి శుక్రవారం సాయంత్రం పక్కా సమాచారం లభించటంతో తన సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లు కమ్ ఓనర్లు అత్తోట జోజి బాబు, శుద్ధపల్లి అనిల్ లపై కేసు నమోదు చేశారు.

పెదకూరపాడు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా దాసు

ప్రజాశక్తి-పెదకూరపాడు: పెదకూరపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గోగులపాటి దాసును ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ జర్న లిస్టులు సమస్యలను అధికారులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరి స్తానని అన్నారు. ఏకగ్రీవంగా తనను ఎన్ను కున్న మండల జర్నలిస్టులకు తన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రభలను ప్రారంభించిన మాజీ మంత్రి కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలను మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. కోటప్ప కొండకు వేళ్ళేందుకు సిద్ధం చేసిన ప్రభ లను వడ్డవల్లి పోలేరమ్మ దేవాలయం వద్ద ఆయన ప్రారంభించారు. రాష్ట్ర కాపునాడు కార్య దర్శి బి.సుబ్బారావు, కె.శ్రీనివాసరావు, టి.అం కమ్మరావు, పి.మాణిక్యం పాల్గొన్నారు.

రెండు ఆలయాలు, రైస్ మిల్లులో చోరీలు

ప్రజాశక్తి-రొంపిచర్ల : మండలంలోని మృత్యుంజయపురం వద్ద గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఈ సంఘటనలో సుమారు రూ.2.35 లక్షల విలువైన వస్తువులు అపహరణకు గురైనట్లు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. అలవాల, అచ్చయ్యపాలెం గ్రామాల మధ్య గల రెండు ఆలయాలల్లో గుర్తుతెలియని వ్యక్తులు ఈ సంఘటనకు పాల్పడినట్లు చెప్పారు. పొలాలకు వెళ్ళిన రైతులు ఆయా ఆలయాల్లో జరిగిన చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సిసి కెమెరాలు, మైక్ సెట్, గ్యాస్ పొయ్యి, సిలిం డర్లు చోరీకి గురయ్యాయి. షిర్డీ సాయి బాబా ఆలయంలో హుండీని పగులగొట్టి రూ.30, 000 అపహరణకు గురైనట్లు, ఈ మేరకు రొంపిచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు చెప్పారు.

ప్రజాశక్తి-మేడికొండూరు

మండలంలోని పేరేచర్ల-సత్తెనపల్లి రోడ్ లోని విఘ్నేశ్వర రైస్ మిల్లులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయంలో మిల్లు వెనుక బాగాన ఉన్న ఇనుప గ్రిల్స్ ను తొలగించి లోపలికి ప్రవేశించారు. కౌంటర్ వద్ద గల బీరువా తలుపులు పగలగొట్టి రూ.5 వేల నగదును, సిసి కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్ ను దొంగిలించారు. శుక్రవారం మిల్లు యాజమాన్యం ఈ మేరకు పోలీసులకు సమాచార మిచ్చారు. మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


నదిలో దూకి ఆత్మహత్యాయత్నం

కాపాడిన ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

ప్రజాశక్తి-తాడేపల్లి: గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వెంటనే మెరైన్ బోటు ద్వారా నదిలోకి వెళ్లి అతన్ని కాపాడారు. ప్రస్తుతం తన వివరావలు చెప్పలేని స్థితిలో అతను ఉన్నాడు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మాచవరం: మండలంలోని మోర్జం పాడు సబ్ సెంటర్‌లో అరబిందో ఈఎంస్, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎపిఎస్ ఎసిఎస్ లింక్ వర్కర్ స్కీమ్ సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరంను శుక్రవారం ఏర్పాటు చేశారు. బి పి, షుగర్, థైరాయిడ్, గర్భిణిలకు ఉచిత రక్త పరీక్షలు, గుండెకు సంబంధించిన ఈసీజి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పం పిణీ అందజేశారు. డాక్టర్ సంజన, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.బ్రహ్మారెడ్డి, ఎంపి హెచ్ఎస్ గ్రేస్, జోన్-2సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు, పంచాయతి కార్యదర్శి వెంకటస్వామి పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,04,921
మిర్చి ఎగుమతి	: 1,09,460
మిర్చి నిల్వ	: 77,788

మిర్చి ధరలు

రూపాయలలో

334	7,500 - 19,500
నెం.5	15,500 - 20,000
273	14,500 - 20,500
341	9,700 - 21,000
4884	15,000 - 20,000
సూపర్ 10	15,800 - 18,000
నాన్ ఎసి	
తేజ	7,000 - 20,000
బడిగి	8,000 - 25,000
దేవనూరు డీలక్స్	9,000- 23,000
తాలుకాయలు	4,000 - 12,500



ప్రారంభ సభలో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

చైతన్య కారకాలు గ్రంథాలయాలు

నారాయణపురంలో ప్రజా గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - దాచేపల్లి

నగర పంచాయతీ అయిన దాచేపల్లి పరిధిలోని నారాయణపురంలోని విశ్రాంతద్యోగుల భవనంలో సి.రాఘవాచారి ప్రజా గ్రంథాలయాన్ని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు సమాజానికి చైతన్య కారకాలని, పుస్తకాన్ని మించిన స్నేహితుడు ఉండడని అన్నారు. పుస్తక పఠనం ద్వారా మేథో వికాసం పొందడానికి ఈతరం యువత ప్రయత్నించాలని సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ సమాజాన్ని గ్రంథాలయాలు నిశ్శబ్దంగా ప్రభావింతం చేస్తాయన్నారు. నూతన గ్రంథాలయానికి తన వందుగా రూ.10 వేల పుస్తకాలను విరాళంగా అందించారు. కౌన్సిలర్ షేక్ షరీఫ్ మాట్లాడుతూ తనకు రాబోయే రెండు నెలల జీతాన్ని గ్రంథాలయ నిర్వహణకు ఇస్తున్నట్లు ప్రకటించారు. అభ్యుదయ రచయితల సంఘం పల్నాడు జిల్లా కన్వీనర్ కోసూరి రవికుమార్ మాట్లాడుతూ దాచేపల్లి పరిసర ప్రాంతాల్లో అభ్యుదయ సాహిత్యం ఒకప్పుడు వెల్లువలా ఎగసిపడిందన్నారు. ప్రజా నాయకులు, వారి పోరాట గాథలు, పాతతరం రచయితల కథలు, ప్రపంచ సాహిత్యాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇందుకోసం నెలకొక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, కవిత రచన, కథ చెప్పడం, పాటలు పాడటం తదితర కళాంశాల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులు, యువతను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంవలో వివిధ సంఘాల నాయకులు టి.సత్యనారాయణ, వి.వెంకటరెడ్డి, ఆంజనేయరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు మాచవరం విద్యార్థి నమూనా

ప్రజాశక్తి - మాచవరం

పల్నాడు జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న తమ విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు మండల కేంద్రమైన మాచవరం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం బి.తాతిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం.చరణ్ పర్యావరణంపై రూపొందించిన నమూనా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ మేరకు ప్రశంసా పత్రాన్ని శుక్రవారం అందించారు. చరణ్‌కు గైడ్‌గా జీవశాస్త్రం ఉపాధ్యాయులు డి.అంకమ్మరావు వ్యవహరించారు. వీరిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.



సందర్శకులతో సున్నితంగా వ్యవహరించండి

- **ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కడా రానివ్వొద్దు**
- **పోలీస్ సిబ్బందికి పల్నాడు ఎస్పీ దిశా నిర్దేశం**



కోటప్పకొండ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ, ఎఎస్పీ

ప్రజాశక్తి - నరసరావుపేట

సందర్శకులకులతో సున్నితంగా వ్యవహరించాలని, వారికి ఇబ్బందులేమీ లేకుండా బందోబస్తు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి సూచించారు. మహాశివరాత్రి సందర్భంగా శనివారం కోటప్పకొండ తిరునాళ్ల నేపథ్యంలో బందోబస్తుపై పోలీస్ అధికారులు, సిబ్బందితో కోటప్పకొండలోని జెడ్‌పి పాఠశాలలో ఎస్పీ శుక్రవారం సమావేశమయ్యారు. ఉత్సవాలు జయప్రదమయ్యేందుకు అన్ని ప్రణాళికలూ సిద్ధమయ్యాయని చెప్పారు. రాష్ట్ర పండుగ అయిన తిరునాళ్లకు 2500 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా రూపొందించిన కోటప్పకొండ పార్కింగ్ యాప్ గురించి ప్రజలకు వివరిస్తూ, వాహనాలను పార్కింగ్ కోసం కేటాయించిన ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చూడాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రభల ప్రదర్శన ప్రాంతాల్లో, దైవ దర్శనం వద్ద జన సందోహం స్తంభించకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు ఎక్కడా రానివ్వొద్దని ఆదేశించారు. అనంతరం తిరునాళ్ల జరిగే పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు జి.బిందుమాధవ్, రామచంద్రరాజు, డీఎస్పీలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి తులసీ సీడ్స్ భోజన సదుపాయం

బందోబస్తు విధుల్లో ఉండే 3 వేల మంది పోలీస్ సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్‌కుకు తులసీ సీడ్స్ చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని తులసీ సీడ్స్ డైరెక్టర్ తులసీ కృష్ణచైతన్య గురువారం ప్రారంభించి మాట్లాడుతూ 12 ఏళ్లుగా ఇలాంటి కార్యక్రమం చేస్తున్నామని, తిరునాళ్ల సందర్భంలో మూడ్రోజుల పాటు భోజన సదుపాయాలను సమకూరుస్తున్నామని వివరించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో పల్నాడు డిఇఒ ఎం.వెంకటప్పయ్య, శిబిరం నిర్వాహకులు పి.శ్రీనివాసరావు, క్యాంపు ఆఫీసరు రాంబాబు, సహాయకులు వి.వి.హరనాథ్, ఎం.కృష్ణయ్య షేక్ దావూస్, ఎస్.అంజిరెడ్డి, తులసీ సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు భోజనం పెడుతున్న కృష్ణచైతన్య

నోటీసులు కాదు.. పట్టాలివ్వండి..

దళితులు సాగు చేసుకుంటున్న భూమికి పట్టాల కోసం వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, సాగుదార్లు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, జై భీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ జె.విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కె.నగేష్‌కు శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలంలోని రెంటపాళ్లకు చెందిన భీమాల రాజారత్నం క్రోసూరు రోడ్డు శ్మశానం పక్కన 1.97 ఎకరాల ప్రభుత్వ భూమిని 40 ఏళ్ల నుండి సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, అప్పట్లో ఆ భూమి రోడ్డుకు 15 అడుగుల దిగువన ఉండగా దాన్ని బాగు చేసుకుని సాగుకు అనువుగా చేసుకున్నారని చెప్పారు. రాజారత్నం మరణంతో ఆయన కుమారులైన దానియేలు, వెంకటప్పయ్య, కోటయ్య, కోడలు రాజేశ్వరి తలో 50 సెట్లు చొప్పున సాగు చేసుకుంటూన్నారని, వీరికి పట్టాల కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఇవ్వలేదని వివరించారు. పైగా ఆ భూమిని తక్షణమే ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారని, దీనిపై రాష్ట్ర ఎస్సీ కమిషన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దళితుల నుండి భూమిని లాక్కోవద్దని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో న్యాయవాది బి.శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఎం.సుధాకర్‌రావు, ఎం.దేవ రాజ్, జె.కమలకుమార్, సాగుదారులు ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కేంద్రం

సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - క్రోసూరు



రైతులకు ఇచ్చిన హామీలేపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ విమర్శించారు. మండల కేంద్రమైన క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో అత్తోట వెంకట అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని చెప్పారు. అయితే వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో పంటలకు మద్దతు ధరల చట్టం, విద్యుత్ సంస్కరణ చట్టం రద్దు, రుణ విముక్తి చట్టం తదితర అంశాలపై దేశవ్యాప్తంగా రైతు సంఘాలు మరో ఉద్యమానికి సిద్ధమయ్యాయని తెలిపారు. ఇందుకోసం ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు మురహరరెడ్డి, కె.నరసింహారావు, డి.నటరాజు, వై.నాగేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ. 21 వేల వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన గ్రామాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కూడా రూ.21 వేల వేతనం అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూరు, పెద్దవడ్లపూడి, నూతక్కి, కాజా, చినకాకాని, నిడమర్రు, బేతపూడి, నవులూరు, ఎర్రబాలెం గ్రామాలలో పారిశుధ్య కార్మికులను కలిసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పన్నులను కార్పొరేషన్ స్థాయిలో వసూలు చేస్తూ కార్మికుల జీతాలు మాత్రం పంచాయతీ స్థాయిలో చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పట్టణంలో కార్మికులకు చెల్లిస్తున్న విధంగా విలీన గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కూడా రూ. 21 వేల వేతనం చెల్లించాలని


ఎర్రబాలెం గ్రామ కార్యదర్శి కోటి రెడ్డి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్న క్రమంలో వారికి వేతనాలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. సబ్బులు, కొబ్బరి నూనె, యూనిఫామ్ ఇవ్వకుండా తాత్సారం చేయడం తగదన్నారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో రెండు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పిఎఫ్ అకౌంట్ అన్నింటిని మెర్జ్ చేసి ఒకే ఖాతాకి జమ చేయాలని, తొలగించిన 100మంది బదిలీ కార్మికులను తీసుకోవాలని, సీఎం ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకునేలా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. డ్రైవర్లకు కూడా హెల్త్ అలవెన్స్ రూ.6వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులను వారికి వర్తింప చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఎర్రబాలెం గ్రామ కార్యదర్శి కోటి రెడ్డి వినతి పత్రం అందజేశారు. సిఐటియు నాయకులు ఎం రవి, ఎం భాగ్యరాజు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాచూరి వేణు, కార్పొరేషన్ సంఘం అధ్యక్షులు వెంగమ్మ, ఎర్రబాలెం నాయకులు టి. బాబులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హైయ్యర్ పెన్షన్ దరఖాస్తుకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-గుంటూరు:సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారంగా హైయర్ పెన్షన్ (ఈపిఎస్ 95 స్కీమ్) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం పెన్షనర్లకు కల్పించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిఎఫ్ కమిషనర్‌ను కోరారు. శుక్రవారం స్థానిక కృష్ణనగర్‌లోని ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌ను లక్ష్మణరావు కలిసి ఈ అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా పిఎఫ్ కమిషనర్ హార్డ్ కాపీ కంటే సాఫ్ట్ కాఫీ ద్వారా..అనగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. కావున 2014కు ముందు ఎవరైతే రిటైరై ఉన్నారో ఎంప్లాయిస్ అందరూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని లక్ష్మణరావు తెలియజేశారు. పిఎఫ్ కమిషనర్‌ను కలిసిన వారిలో సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, కెసిపి స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ఎన్.లక్ష్మయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.మహేష్ నాయకులు ఉన్నారు.

ఎస్ఆర్ఎంలో పారి బిజినెస్ స్కూల్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో పాల్గొన్న వర్శిటీ యాజమాన్యం

ప్రజాశక్తి -మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం 'పారి బిజినెస్ స్కూల్‌ను వర్సిటీ యాజమాన్యం ఘనంగా ప్రారంభించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పేరున్న కెరీర్ 360 ఎడ్యుకేషన్ పోర్టల్ వ్యవస్థాపక ఛైర్మన్ మహేశ్ పేరి, బార్ క్లేస్ ఇండియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాల అయ్యర్లు ముఖ్య అతిథులుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించి పారి బిజినెస్ స్కూలును ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన స్కూల్ ప్రారంభ సదస్సులో మహేశ్ పేరి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయనీ, విద్యార్థులు టెక్నాలజీ ప్రయోజనాలను అందిపుచ్చుకుని పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ నికోలస్, ప్రశాంత్ మహాపాత్ర వంటి ప్రముఖుల సూచనలతో ఏపీ ఎస్ఆర్ఎం ఏర్పాటు జరిగిందని, యూనివర్సిటీ అభివృద్ధికి వారందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ కృష్ణానది ఒడ్డున గల వెంకటపాలెంలో టీటీడీ నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తరపున రెండు బస్సులు అందజేస్తున్నామన్నారు. యాత్రికుల ప్రయోజనార్థం బస్సులను అందజేస్తున్నామన్నారు. అతుల్ త్రిపాఠి, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సుబ్బారావు

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు:మండలంలో మంజూరైన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి, మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో కృషి చేయాలని గుంటూరు రూరల్ జెడ్పీటిసి తుమ్మల సుబ్బారావు అన్నారు. శుక్రవారం మండల ఆఫీసు సమావేశ మందిరంలో ఎంపిపి పులగం దివ్య అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో మంజూరై, పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం చేయాలన్నారు. బిల్లులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే సుచరిత కూడా ఎంతో సహకారం అందిస్తున్నారని, గడప గడపకూ కార్యక్రమంలో కూడా మంచి స్పందన వస్తుందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆమెను గెలిపించుకోవటానికి మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. జెడ్పీ నుండి మండలానికి ఇచ్చే నిధులతో గ్రామాల్లో పొలాలకు వెళ్లే రహదారులను అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల నివేదికలు అందచేశారు. ఉగాదికి గృహప్రవేశాలు ఉన్నందున పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సత్యనారాయణ కోరారు. ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లలో మండలం 70 శాతంగా ఉందని, నాన్ ట్యాక్స్‌లో 30 శాతమే వచ్చిందన్నారు. ఇందులో వాటర్ ట్యాక్స్ పెండింగ్ ఉందన్నారు. ట్యాక్స్‌లు చెల్లించకపోతే కనెక్షన్లు నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. ఎంపిడిఒ శోభారాణి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నటరాజన్


ఖోఖో ఆటలో తలపడతున్న క్రీడాకారులు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

వైభవంగా ముగిసిన విజ్ఞాన్ మహోత్సవ్

ప్రజాశక్తి-గుంటూరు: మండలం, వడ్లమూడి యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి మహోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసింది. ఆటల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు ట్రోఫీలను, నగదు బహుమతులను అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎస్‌పీఏ డైరక్టర్, ఐఎఎఫ్ లెవల్-1 కోచ్, ఇంటర్నేషనల్ అథ్లెట్ డాక్టర్ ఆర్.నటరాజన్ మాట్లాడుతూ 2028గానీ, 2032 ఒలింపిక్స్ క్రీడల్లో విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు దేశం తరుపున పతకం సాధించేలా ఎదగాలని అన్నారు. విద్యార్థులందరూ ప్రధానంగా ఐదు విషయాల్లో (ఆరోగ్యం, తిండి, నిద్ర, ఆటలు, చదువు) అజాగ్రత్తగా ఉండకూడదన్నారు. ఎవరైతే నిత్య నూతనంగా ఆలోచిస్తారో వారే జీవితంలో విజయాన్ని అందుకోగలరన్నారు.విజ్ఞాన్ మహోత్సవ్ సినీఇండస్ట్రీలో చాలా మందిని డైరక్టర్లుగా, సినీహీరోలుగా, యాంకర్లగా తయారు కావటానికి దోహదం చేసిందని విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. 2030 సంవత్సరం నాటికి ప్రపంచంలో 80 శాతం మంది ప్రజలు ఎంటర్‌టైన్‌మెంట్ రంగంవైపు రావడానికి ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. వినూత్న ఆలోచనలకు కాసింత క్రియేటివిటీ, టెక్నాలజీను ఉపయోగించుకుంటే జీవితంలో ముందుకు దూసుకెళ్లి పోవచ్చన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని, దాని సాధించేంతవరకు అవి శ్రాంతంగా కష్టపడాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు అన్నారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ప్రసంగించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు ఉన్నారు.

తాగునీటి పైపులైనులోకి మురుగు నీరు

- నాలుగు దశాబ్దాల నాటి పైపులైన్లు
- రోగాల బారిన ప్రజలు
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కలుషిత తాగునీరు పట్టణ ప్రజలను పట్టి వేధిస్తుంది. ప్రజలకు తాగునీరు సరఫరాలో చిలకలూరిపేట పురపాలక సంఘం విఫలమవుతోంది. పట్టణ తాగునీటి సరఫరాకు, పైప్ లైన్ల నిర్మాణం, కాలువల మరమ్మతులు అంటూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చుల్లో చూపిస్తున్నా దాని ఫలి తం మాత్రం కనబడటం లేదు. తాగు నీటి సరఫరా చేసే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి వాటర్ ట్యాంకులకు సరఫరా చేసే పైపు లైన్లు, ఫిల్టర్ బెడ్లు దశాబ్దాల కాలం నాటివి. శుద్ధమైన తాగునీరు అందిం చాల్సిన పురపాలక సంఘం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ప్రజల ఆరోగ్యాన్ని గాలికొది లేసిందనే విమర్శలు వినిపిస్తు న్నాయి .పట్టణంలో సర ఫరా అయ్యే తాగునీరు పచ్చగా, పురు గులతో, రంగు మారి వస్తున్నాయి. ఈ నీటిని తాగిన ప్రజ లకు అనారోగ్యం, చర్మ వ్యాధుల బారిన. పడటం జరుగుతోంది.

పట్టణంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైను సుమారు నాలుగు దశాబ్దాల నాటిది. దీనికి కాలం చెల్లడంతో శిథిలా వస్థకు చేరడం, కొన్నిచోట్ల లీకేజీలు, నీటి సరఫరా పైపునకు మురుగునీరు కలిసి కలు షిత నీరు సరఫరా అవుతోంది. ఈ నీటినే తాగడంతో ప్రజలు రోగాల బారిన పడు తున్నారు. గాంధీ పేట, సుబ్బయ్యతోట, పం డరీపురం, కళామందిర్ సెంటర్, ఎమ్మెల్యేల వీధులతోపాటు పట్టణ ప్రముఖులు నివ సించే తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

పట్టణంలో డ్రైనేజీ కాలువలు అధ్వా నంగా తయారయ్యాయి. డ్రైనేజీ కాలు వల అడుగుభాగం సిమెంట్ ప్లాట్ ఫారం కొట్టుకుపోయి పారుదల లేక నిలిచిపోయిన మురుగునీరు భూమిలో ఇంకడంతో తాగునీరు కలుషితమవు తోంది. మరో ప్రత్యామ్నాయం లేక ప్రజలు తాగునీటి కేన్లను కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. పట్టణంలో 25 వేల నివాస గృహాలు ఉన్నాయి. ఒక్కొక్క ఇంటికి రోజుకు ఒకటి లేదా రెండు కేన్లను రూ.40 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

శుద్ధమైననీటిని సరఫరా చేస్తున్నామని మునిసిపల్ అధికారులు, పాలకులు చెబు తుండటంపై ప్రజలు విమర్శలు చేస్తు న్నారు. ఇంటి పన్ను నీటి పన్ను అంటూ వివిధ పన్నుల రూపాయల ప్రజల నుండి కోట్ల రూపాయలు వసూలు చేస్తున్న చిలకలూరిపేట పురపాలక సంఘం, ప్రజలకు తాగునీరు అందించటంలో పూర్తిగా విఫలమవుతోంది.పట్టణప్రజలకు కలుషితనీరు సరఫరాపై అవుతుండటంతో అధికారులు, నాయకులపై ఆరోపణలు గుప్పిస్తున్న వారు లేకపోలేదు.

అనధికారిక వాటర్ ప్లాంట్ల యాజమాన్యాల నుండి సిండికేట్ పద్ధతిలో నెలకు లక్షల్లో ముడుపులు అందుకుని, కలుషిత నీటి సమస్యను పరిష్కరించడం లేదనేది వారిపై ఆరోపణలు. అధికారులు ఇప్పటికైనా స్పందించి భూ గర్భ డ్రైనేజ్ నిర్మా ణాలు చేయాలని, కలుషిత తాగునీటి నివారణకు పాత పైపు లైన్ స్థానంలో కొత్త పైపు లైన్లు వేయాలని తద్వారా శు ద్ధమైననీటిని సరఫరా చేసేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పండరీపురంలోని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఇంటి పక్కనే తుప్పు పట్టిన తాగునీటి పైపు


రాగన్నపాలెంలోని సిమెంట్ రోడ్డు కింద పైప్ లైజ్ లీకేజ్


విశ్వనాథ్ సినిమా థియేటర్‌సెంటర్‌లో


స్థానిక మంత్రి పిఎ నివసించే సుబ్బయ్యతోటలోని ఇంటి ముందు పరిస్థితి



రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని చిన్నమక్కెనలో సత్తెనపల్లి ఆర్డిఒ రాజకుమారి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీ సర్వే ను ఆమె పరిశీలించారు. రీ సర్వే సక్రమంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. తహశీల్దార్ క్షమారాణి, వీఆర్వో జాన్ సైదా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో ఎంపిపి పరిశీలన

ప్రజాశక్తి-నూజెండ్ల

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిపి మేడం జయరామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి, పాఠశాల పిఎంసి ఛైర్మన్ వంగూరు ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు అన్న పూర్ణమ్మ లు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.



విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-మాచవరం

మండలంలోని మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పౌష్టి కాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మాచవరం జడ్పిటిసి జె.శివ యాదవ్ శు క్రవారం ప్రారంభించారు. ప్రధానో పాధ్యాయులు తాతరెడ్డి, వేమవరం వేమవరం సర్పంచ్ డి.కృష్ణారెడ్డి, ఎంపిటిసి ఎస్. లక్ష్మీ నర సమ్మ నరసింహరెడ్డి, వైస్ సర్పంచ్ గాదె కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సత్తెనపల్లిరూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్ వినియోగ దారుల హక్కుల పరిరక్షణ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో పేదలకు దుప్ప ట్లు పంపిణీ చేశారు. మండలం లోని వావి లాల్ నగర్ లో 30 మంది పేదలకు శుక్రవారం దుప్ప ట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంకణాలపల్లి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ రుద్ర పాటి చెన్నమ్మ రోటరీ క్లబ్ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగసాయి ప్రసాద్ ,రోటరీ క్లబ్ అధ్యక్షులు పి.మహేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రతినిధులు టి.వెంకటేష్, ఎం.రాహుల్ గౌతమ్, ఎం.జగన్, పశుసంరక్షణ శాఖ అసిస్టెంట్ మధిర పూజిత పాల్గొన్నారు.


మిషన్ శోభకృత్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ నగేష్

ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మిషన్ శోభకృత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని తహ శీల్దార్ కె.నగేష్ అన్నారు. 'మిషన్ శోభకృత్'పై అధికారు లకు అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరి షత్ కార్యా లయంలో మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులకు అవగాహన కల్పిం చారు. తహశీల్దార్ మాట్లాడుతూ మిషన్ శోభ కృత్ కింద చేపట్టాల్సిన తొమ్మిది లక్ష్యాల గురించి కూలంకషంగా వివరిం చారు. కార్యాలయాల్లో వృథాగా పడి ఉన్న వివిధ రకాల పాడైపోయిన వస్తు వులను గుర్తించడం, జిల్లా కార్యాలయ మాన్యువల్ ప్రకారం కార్యాలయాల పాత కరెస్పాండెన్స్‌ను గుర్తించడం, కార్యాలయాల పరిసరాల్లోని పిచ్చి చెట్లను తొలగించడం, పాత,పనికిరాని వాహనాలను గుర్తించడం, కార్యా లయాల్లో నేమ్ బోర్డులను పల్నాడు జిల్లా పేరిట అప్‌డేట్ చేయడం, పనిక ిరాని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ కార్యా లయాలను, 2019 జూన్ ముందు ప్రారంభించి పూర్తి కాకుండా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను గుర్తిం చడం గురించి వివరించారు. ఎంపి డిఒ జివి సత్యనారాయణ మాట్లా డుతూ వివిధ గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను ఎలా తరలిం చాలనే దానిపై ప్రణాళికను వివరించారు. ఉగాది పండుగ నాటికి మిషన్ శోభకృత్ కార్య క్రమాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.షమీ, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని మాచర్ల మలే రియా సబ్ యూనిట్ అధికారి డి.లక్ష్మయ్య, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు శుక్రవారం నిర్వ హించారు. స్థానిక దేశవరపు క్యాంప్ తండాను సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. మురికి కుంటలు, గృహాలలోని నీటి తొట్లను పరిశీలించి, టెమోపాస్ మందును సిబ్బందితో స్ప్రే చేయించారు. మలేరియా అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ గ్రామస్తులందరూ మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా గృహాల్లో పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైడ్ కాలువలు, మురికికుంటలు, నీటితొట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. సీజ నల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారుల వెంట ఎఎన్ఎం కుమారి బాయి, ఎంఎల్ హెచ్‌పి సంధ్య, ఆశా వర్కర్ కుమారి ఉన్నారు.


దేశవరపు క్యాంప్ తండాను సందర్శించిన మలేరియా సబ్ యూనిట్ అధికారి

అమరావతిలో మహాశివరాత్రికి అన్నదానం

ప్రజాశక్తి - అమరావతి

మహాశివరాత్రి సందర్భంగా అమరావతి అమరేశ్వరాలయానికి విచ్చేసే సందర్శకులకు అమరలింగేశ్వర కాపు సేవా సంఘం ఆధ్వ ర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్లు వ్యవస్థాపకులు పి.మస్తాన్‌రావు, వ్యవ స్థాపక అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు చెప్పారు. స్థానిక సదావర్తి సత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పుష్కరకాలంగా తమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో ముందుకు సాగుతోందని, ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా నిర్వహిస్తు న్నామన్నారు.సదావర్తి సత్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కుల,మతాలకు అతీతంగా సందర్శకులందరూ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. గత పదమూడేళ్లుగా అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న వారికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ

• జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటానికి క్షేత్రస్థాయి అధికారులను, సిబ్బందిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ వైద్యారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని, జిల్లా వైద్యారోగ్యశాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు గుర్తించి నోటిఫికేషన్ జారీ చేసి, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం భర్తీ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమంలో తక్కువుగా ఓపీలు వస్తున్న గ్రామాలను పరిశీలించి కారణాలను విశ్లేషించాలని, సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా ఫేస్ రికగ్నైజేషన్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అనధికారికంగా విధులకు హాజరు కాని సిబ్బందికి మోమోలు జారీ చేయాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకొని డిచార్జ్ అయిన రోగుల ఫీడ్ బ్యాక్ తీసుకోవటంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులను వివరణ కోరుతూ మెమోలు జారీ చేయాలన్నారు. బాలికలు, మహిళల్లో రక్తహీనత వారిని గుర్తించేందుకు నిర్దేశిత పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని, మోడరేట్, సివియర్ కేసులకు సంబంధించి రోగులపై ప్రత్యేక దృష్టి పెట్టి వైద్య సేవలు, మందులు అందించాలన్నారు. జిల్లాలో నిర్మాణాలు పూర్తి అయిన అర్బన్ హెల్త్ సెంటర్లను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని, నిర్మాణంలో ఉన్న భవనాల పెండింగ్ పనులు వెంటనే పూర్తి అయ్యేలా పర్యవేక్షణ ఏజెన్సీలతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో వైద్యారోగ్యశాఖలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హనుమంతరావు, డీటీసీఓ డాక్టర్ లక్ష్మానాయక్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జయరామకష్ణ, ఐడీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రఘు, ఎపిడామాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత


విద్యార్థులతో మాట్లాడుతున్న రాయల సుబ్బారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో శుక్రవారం విద్యార్థినీవిద్యార్థులకు పోషకాహారం (న్యూట్రిషన్ ఫుడ్) అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయల సుబ్బారావు మాట్లాడుతూ తిండి కలిగితే కండ కలదోయ్.. కండ కలవాడే మనిషోయ్ అనే గురజాడ సూక్తిని ఉదహరించారు. విద్యార్థినీ విద్యార్థులు పోషకాహారం ఆహారం తీసుకోవడం ద్వారా చదువలో మరింత ఉన్నతంగా రాణించవచ్చని చెప్పారు. అందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసి అందరికీ న్యూట్రిషన్‌ఫుడ్ అందజేస్తుందన్నారు. దీనిని విద్యార్థులు వినియోగించుకుని చదువుల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్, పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న 'మూల స్తంభాలు' పుస్తావిష్కరణ

ప్రజాశక్తి - గుంటూరు

డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందర్రావు రచించిన తెలుగు నాటకరంగ మూల స్తంభాలు పుస్తకావిష్కరణ సభ ఈ నెల 21 వతేదీ మంగళవారం సాయంత్రం గుంటూరు నగరం లక్ష్మీపురం మెయిన్ రోడ్ లోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో జరుగుతుందని అజో విభో కందాళం ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ తెలిపారు. అజో విభో కందాళం ఫౌండేషన్ సంస్కృతీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్రీయ విశ్వ విద్యాలయ విశ్రాంత నాటకాచార్యులు డాక్టర్ డియస్ఎన్ మూర్తి పుస్తకావిష్కరణ చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సజనాత్మక సంస్కృతీ సమితి విశ్రాంత ముఖ్య కార్య నిర్వహణాధికారి డాక్టర్ డి విజయ భాస్కర్ నాటక సినీ రచయిత వై యస్ కష్ణేశ్వరరావు సంస్కృతి అధ్యక్షులు యస్ బాలచందర్ అతిధులుగా పాల్గొంటారని తెలిపారు . ఈ గ్రంధంలో 234మంది రంగస్థల ప్రముఖుల నాటక రంగ ప్రస్థానాన్ని రచయితలు వివరించినట్లు అప్పాజోస్యుల పేర్కొన్నారు.

ఉద్యోగులకిచ్చిన ఏ హామీ నెరవెర్చలేదు

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాష



సమావేశ:లో మాట్లాడుతున్న చాంద్‌బాష

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమాశం శుక్రవారం స్థానిక గుంటూరు మెడికల్ కాలేజి ప్రాంగణంలోని సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదన్నారు. ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు సిపిఎస్ విధానం రద్దు చేస్తానని, కాంట్రాక్టు ఉద్యోగులను దశలవారీగా క్రమబద్ధీకరిస్తానని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తానని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలని చెల్లిస్తానని చెప్పి అనేక హామీలు ఇచ్చారన్నారు. చివరకు మంచి పిఆర్‌సి ఇస్తాను అని చెప్పి రివర్స్ పిఆర్‌సి ఇచ్చి ఉద్యోగులకు మొండి చేయి చూపించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎపిజిఇఎ జిల్లా కార్యదర్శి శివారెడ్డి ఉపాధ్యక్షులు శ్యామ్ పోతురాజు, నీలిమా, నాగూర్ వలి, రత్తయ్య, భరత్ కుమార్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ కరిముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ బాబు పాల్గొన్నారు.

కాల్వలో తుటాకు తొలగించాలని కలెక్టర్‌కు వనితి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

గుంటూరు జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో గుంటూరు జిల్లా వ్యవసాయ సలహామండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని కలసి పొన్నూరు మండలంలోని కసుకర్రు గ్రామంలో పంట కాలువలను, గుర్రపుడేగా, తుటాకు తొలగించాలని వినతి పత్రాన్ని అందించారు. కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈ ,ఈఈ ను సకాలంలో పంట కాలువలను బాగుచేయాలని అధేశించారు.

కెఎల్‌యును సందర్శించిన ఇటలీ విశ్వవిద్యాలయ ప్రతినిధి

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్


అంతర్జాతీయ ప్రతినిధి కెమిల్లా ఆంద్రియాని

ఇటలీలోని పడువా విశ్వ విద్యాలయం అంతర్జాతీయ ప్రతినిధి కెమిల్లా ఆంద్రియాని శుక్రవారం కెఎల్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. కెఎల్ యులో చదువుతూ ఆయా కారణాలతో విదేశాలలో చదవాలనుకునే విద్యార్థులకు తమ విశ్వవిద్యాలయం తరుపున అవకాశాలను కల్పించడంతో పాటు ప్రత్యేకమైన ఉపకారవేతనాలను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. కెఎల్ విశ్వవిద్యాలయంతో తాము అవగాహనా ఒప్పందాన్ని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు తమ విశ్వవిద్యాలయం యొక్క ప్రత్యేకతలను వివరించారు. పడువా విశ్వ విద్యాలయంలో అందుబాటులో ఉన్న అధ్యయనం, స్కాలర్‌షిప్ అవకాశాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆమె కెఎల్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎం.హెచ్.ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

సరైన ప్రణాళికతో ఒత్తిడిని అధిగమించొచ్చు


విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణభగత్

ప్రజాశక్తి-గుంటూరు

సరైన ప్రణాళిక ద్వారా పరీక్షల వేళ విద్యార్థుల్లో కలిగే భయాలు, ఒత్తిడిని అధిగమించవచ్చని సైకాలజిస్ట్ డాక్టర్ కృష్ణభగత్ అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం మెయిన్ క్యాంపస్‌లో భాష్యం మెడెక్స్ కళాశాల, భాష్యం ఐఐటీ విద్యార్థులకు పరీక్షల భయాన్ని, ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణభగత్ మాట్లాడుతూ జ్ఞానేంద్రియాల ద్వారా సమాచారం మానవ మెదడుకు అందుతుందని, అందులో ముఖ్యమైన నేత్రాల ద్వారా మనం చూసిన చిత్రం, దాని తాలూకు సమాచారమంతా మెదడులో నిక్షిప్తమై ఉంటుందన్నారు. అందువల్ల మనం ఊహాశక్తిని ఉపయోగించుకొని మెదడుకు సరైన సంకేతాలు అందించటం ద్వారా పరీక్షల భయాన్ని, ఒత్తిడిని అధిగమించి, రానున్న పరీక్షలకు సునాయాసంగా సమాయత్తం కావచ్చన్నారు. భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించి వారిలో మానసిక స్థైర్యాన్ని నింపటానికి భాష్యం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఉన్నత విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ప్రాక్టికల్ పరీక్షలకు 606 మంది హాజరు


ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైన ఎన్‌సిసి విద్యార్థులు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎన్‌సిసి కేడెట్‌లకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. డ్రిల్ మ్యాఫ్‌ను గుర్తించుట, ఆయుధాలను ఉపయోగించుట వంటి పలు పరీక్షలను నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్.జయకుమార్ అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు మూడు జిల్లాలకు చెందిన పలు కళాశాలల నుండి సుమారు 606 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్.జయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యోగాల సమయంలో మెరిట్ మార్కులకు ఎన్‌సిసి అందించే సి సర్టిఫికేట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రాక్టికల్ పరీక్షలో పాసైన వారికి ఈ నెల 19న రాత పరీక్ష కూడా ఉందన్నారు. రాత పరీక్షలో కూడా పాసైన వారికి సి సర్టిపికేట్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్నల్ ఆర్‌పి.సింగ్, కల్నల్ అజయ్ కుటినో, కల్నల్ కుమార్ ఉమాశంకర్, గుర్నాం సింగ్, అసోసియేట్ ఎన్‌సిసి అదికారిణులు లెప్టినెంట్ ఉషాక్రాంతి, పావనిలతో పాటు విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో.విసి డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, డాక్టర్ హబీబుల్లాఖాన్, సమన్వయకర్త చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పెదకాకాని దుర్గా మల్లేశ్వర, భ్రమరాంబ అమ్మవారులు

ముస్తాబైన పెదకాకాని దుర్గామల్లేశ్వరస్వామి అమ్మవార్లు

ప్రజాశక్తి-తెనాలి

మహాశివరాత్రి సందర్భంగా పెదకాకానిలోని శ్రీ గంగాభ్రమరాంబా సమేత శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి అమ్మవార్ల దేవస్థానం విధ్యుత్ దీపాలతో ముస్తాబైంది. ఆలయానికి సందర్శకులు పోటెత్తుతున్నారని, వారికి సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజాము మూడు గంటల నుంచి యాత్రికులు ఆలయ ప్రాంగణంలోకి రావచ్చన్నారు. ఉదయం 10.30 గంటలకు 11 రకాల ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం, మద్యాహ్నం 12 గంటలకు ఎదురుకోలోత్సవం, తెల్లవారు జాము 2 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహో త్సవం జరిపిస్తున్నారు. 19న మద్యాహ్నం ఒంటిగంటకు స్వామివార్లకు మహానివేదన, నంది వాహనంపై గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 20న సాయంత్ర నాలుగు గంటలకు గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దివ్యరథోత్సవం జరగుతుంది. 21న ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వసంతోత్సవం, అశ్వవాహనంపై గ్రామోత్సవం, అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారికి, అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఎన్.శ్రీనివాసరెడ్డి చెప్పారు.


మహాశివరాత్రి శుభాకాంక్షలతో...
సమస్త ప్రజానీకానికి ఆ మహాదేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ... మహాశివరాత్రి శుభాకాంక్షలతో...
మీ... రవి


మహాశివరాత్రి శుభాకాంక్షలతో
గ్రామ ప్రజలకు, అధికారులకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు, అభిమానులకు మహాశివరాత్రి శుభాకాంక్షలతో...
తాడి వెంకటేశ్వర్లు
పంచాయతీ కార్యదర్శి
తిమ్మాపురం గ్రామపంచాయతీ
పుల్లగూర ప్రభావతి జాన్
సర్పంచ్, తిమ్మాపురం గ్రామపంచాయతీ
చిలకలూరిపేట మండలం
పుల్లగూర జాన్
ప్రముఖ న్యాయవాది
తిమ్మాపురం గ్రామం.


మహాశివరాత్రి శుభాకాంక్షలతో
నియోజకవర్గ ప్రజలందరికీ, జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మహాశివరాత్రి శుభాకాంక్షలతో...
పెంటేల బాలాజీ
చిలకలూరిపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు
చిలకలూరిపేట.


మహాశివరాత్రి శుభాకాంక్షలతో...
మహాశివరాత్రి మహోత్సవానికి వచ్చు యాత్రికులకు, భక్తులకు
స్వాగతం ... సుస్వాగతం
భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం -రేవేంద్రపాడు
మల్లేశ్వరస్వామి దేవస్థానం - శృంగారపురం
విశ్వేశ్వరస్వామి దేవస్థానం -పెరుకలపూడి
మల్లేశ్వరస్వామి దేవస్థానం - తుమ్మపూడి
ఆనందేశ్వర-రాజరాజేశ్వర స్వామి దేవస్థానం - పెదకొండూరు
భోగేశ్వర స్వామి దేవస్థానం - చిలువూరు
అడపాల శ్రీనివాసరావు
కార్యనిర్వహణాధికారి మరియు సిబ్బంది
దుగ్గిరాల మండలం


రండి!
దర్శించండి !!
తరించండి !!!
శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానము
కోటప్పకొండ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న
నరసరావుపేట శాసన సభ్యులు డా॥ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గారికి
తిరునాళ్ళ మహోత్సవానికి విచ్చేయుచున్న
నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు గారికి,
భక్తులందరికి స్వాగతం.. సుస్వాగతం...
కోటి వేల్పుల అండ
కోటప్పకొండ
ది. 18-02-2023 శనివారం మహాశివరాత్రి పర్వదిన
సందర్భంగా శ్రీ స్వామి వారిని దర్శించి తరించండి...
రాజా మల్రాజు బహదూర్, వ్యవస్థాపక చైర్మన్
వేమూరి గోపి, కార్యనిర్వహణాధికారి